నేడు వాహనాల వేలం

నర్సంపేట, నవంబర్ 27: ఎక్సైజ్ శాఖకు పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.నరేశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం ఏఈఎస్ మురళీధర్ సమక్షంలో వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

'కార్మికుల వేతనాలు పెంచాలి'

కరీమాబాద్, నవంబర్ 27: సామిల్లు, టింబర్ డిపో కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ డిమాండ్ చేశారు. వరంగల్ 43వ డివిజన్ రామగోపాలపురంలోని సామిల్లు, టింబర్ డిపో హమాలీలు బుధవారం ఏఐటీయూసీలో చేరారు. ఆయన మాట్లాడుతూ సామిల్లు, టింబర్ డిపో యజమానులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఫ్లెక్సీ వద్ద కార్పొరేటర్ కుమారస్వామి

చెత్త వేయకుండా వినూత్న ప్రయత్నం

పోచమ్మమైదాన్, నవంబర్ 27: వరంగల్ 22వ డివిజన్ మర్రి వెంకటయ్యకాలనీలోని సీసీరోడ్డు పక్కన కాలనీవాసులు చెత్త వేయడం నిత్యం సర్వసాధారణంగా మారింది. ఎన్నిసార్లు చెప్పినా కాలనీవాసులు పెడచెవిన పెడుతుండడంతో కార్పొరేటర్‌తో పాటు శానిటేషన్ సిబ్బంది విసిగిపోయారు. దీంతో చెత్త వేయకుండా రోడ్డు పక్కన మూడు మతాల దేవుళ్ల ఫొటోలు ముద్రించిన ఫ్లెక్సీని బుధవారం కట్టారు. శానిటేషన్ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు చెత్తను అందించాలని కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి కోరారు.

'పోరాటాలతోనే సమసమాజం'

ఖిలావరంగల్, నవంబర్ 27: సీపీఎం ఖిలావరంగల్ మండల సభను ఏసిరెడ్డినగర్‌లోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి రంగయ్య హాజరై మాట్లాడారు. ప్రజా పోరాటాలతోనే సమసమాజ నిర్మాణం సాధ్యమన్నారు. ఏరియా గైడ్ నలిగంటి రత్నమాల, ఎల్లయ్య, అనిల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ జిల్లా ప్రధాన జడ్జి వారి కోర్టు, హనుమకొండ.
MVOP No. 570/2022
బిట్వీన్:
1) అనిశెట్టి విజయ @ విజయలక్ష్మి
2) అనిశెట్టి రాశి ...క్లెయిమ్ పిటిషనర్స్
మరియు
1) దారావత్ రాజు మరియు మరొకరు ...రెస్పాండెంట్స్
నోటీసు
R1: దారావత్ రాజు, తండ్రి: హరియ, Age: మేజర్, వృత్తి: డ్రైవర్ ఆఫ్ ది క్రైం వెహికల్, నివాసం: సుందరయ్య నగర్, గుండ్లసింగారం, హనుమకొండ సిటీ & జిల్లా.
పైన తెలిపిన క్లెయిమ్ పిటిషనర్స్, రెస్పాండెంట్ నెం. 1 & 2 అయిన మీపై మోటార్ వాహన ప్రమాద నష్టపరిహారం కొరకు పైన తెలిపిన కోర్టు వారి నందు దావా దాఖలు పరచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు 20/12/2024న వాయిదా ఉన్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టువారి ఎదుట తేది: 20/12/2024న ఉ|| 10.30 గంటలకు హాజరు కాగలరు. లేనియెడల, కేసు మీ పరోక్షమందు తీర్మానించబడును.
// కోర్టు వారి అనుమతితో //
G.రవీందరరావు, J.నర్సింగరావు,
న్యాయవాదులు, హనుమకొండ.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లినర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సైన్స్‌ఫేర్ అదుర్స్

- టెక్నాలజీకి అనుగుణంగా నూతన ఆవిష్కరణలు
- కొత్త ఆలోచనలతో విద్యార్థుల ప్రదర్శనలు
- 500లకు పైగా ఎగ్జిబిట్ల తయారీ
- తిలకించేందుకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు

నర్సంపేట రూరల్, నవంబర్ 27: మండలం మహేశ్వరంలోని శివానీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రెండో రోజు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కొత్త ఆలోచనలతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిట్లను తయారు చేసి ఇక్కడ ప్రదర్శించారు. సైన్స్‌ఫేర్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించేందుకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ప్రదర్శనలను న్యాయనిర్ణేతలు పరిశీలించారు. ఉత్తమ ఎగ్జిబిట్లను ఎంపిక చేయనున్నారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో 17 వివిధ రకాల కమిటీలు పనిచేస్తున్నాయి. మొదటి రోజు మూడు వేల మందికి పైగా విద్యార్థులు సైన్స్‌ఫేర్‌ను తిలకించగా, రెండో రోజు 92 పాఠశాలల నుంచి 5వేలకు పైగానే విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనలను తిలకించారు.

ఎగ్జిబిట్లను తిలకించేందుకు వచ్చిన విద్యార్థులు

13 మండలాల నుంచి ఎగ్జిబిట్ల ప్రదర్శన

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో జిల్లాలోని 13 మండలాల్లోని 147 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల నుంచి 500లకు పైగా విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్బీవీపీ) కింద విద్యార్థులు పలు రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర 56 రకాల ఎగ్జిబిట్లు, రవాణా, సమాచార ప్రసారం 54, సహజ వ్యవసాయం 38, విపత్తుల నిర్వహణపై 47, గణిత నమూన, గణన ఆలోచనలపై 37, వ్యర్థాల నిర్వహణ 53, వనరుల నిర్వహణపై 67 ఎగ్జిబిట్లు ప్రదర్శనకు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీటిలో 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల ఎగ్జిబిట్లను జూనియర్స్ విభాగంలో, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎగ్జిబిట్లను సీనియర్స్ విభాగంలో బహుమతులు అందించనున్నారు. వీటితోపాటు జిల్లాలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో బీఈడీ, డీఈడీ విద్యార్థులు టీచర్ ట్రైనింగ్ కేటగిరీలో, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు టీచర్ కేటగిరీలో వినూత్నమైన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. గురువారం సాయంత్రం జరగనున్న సైన్స్‌ఫేర్ ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపిక చేయనున్నారు. సైన్స్‌ఫేర్‌ను ఎంఈవో కొర్ర సారయ్య, నిర్వహణ కమిటీ సభ్యుడు పట్టాభి, శివానీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డైరెక్టర్ రాహుల్‌వర్మ, వివిధ నిర్వహణ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు

తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్న పోలీసులు

ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి

నర్సంపేట, నవంబర్ 27: పట్టణంలో అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పట్టణ పరిసరాల్లో భూ వివాదాలను సృష్టిస్తూ తప్పుడు కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న నర్సంపేట పట్టణ సీఐపై తగిన చర్యలు తీసుకోవాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బుధవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ పట్టణంలో తాను 25 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, మహబూబాబాద్ రోడ్డులో శ్రీసాయి రియల్ ఎస్టేట్‌లో అమ్మకాలు, కొనుగోలుపై తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అయినా రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేస్తూ అధికార పార్టీ నేతల ఆదేశానుసారం తనపై అక్రమ కేసులు నమోదు చేసి పట్టణ సీఐ తరచూ స్టేషన్‌కు పిలిచి అవమానకరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. సీఐ నుంచి తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న రామస్వామి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఖానాపురం/ గీసుగొండ/ పర్వతగిరి/ రాయపర్తి, నవంబర్ 27: ఖానాపురం మండలం కొత్తూరుకు చెందిన ఫొటోగ్రాఫర్ క్యాతం సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడె రవి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పరామర్శించారు. సాయికుమార్ మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అసోసియేషన్ తరపున రూ.70వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, సూరిబాబు, శ్యామ్, తడుగుల స్వామి, జాడి కిరణ్, రవి, శ్యామ్, వెంకటేశ్, రాజు, శ్రీనివాస్, సతీశ్, రమేశ్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ మండలంలోని ఎలుకుర్తికి చెందిన భీమగాని సంతోష్‌కుమార్ మృతిచెందగా, బాధిత కుటుంబానికి 1997-98 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు రూ.50వేల ఆర్థికసాయం అందించారు. పర్వతగిరి మండలంలోని ఏనుగల్లులో నాగెల్లి యాకయ్య మృతిచెందగా, హెల్పింగ్ హ్యాండ్స్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన సుమారు రూ.15,500లను బాధిత కుటుంబానికి అందించినట్లు గ్రూప్ అడ్మిన్ గూడ నరేందర్‌వర్మ తెలిపారు. రాయపర్తి మండలంలోని కొండూరుకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత పోల్నేని శ్యామ్‌రావు మృతిచెందగా, పురుషుల పరపతి సంఘం తరపున రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

చెక్కు అందజేస్తున్న సంఘం బాధ్యులు

నేడు చందా కాంతయ్య జయంతి

- బీఆర్‌ఎస్ హయాంలోనే సీకేఎం కళాశాల ప్రభుత్వపరం
- ప్రస్తుతం రెగ్యులర్ స్టాఫ్ లేక విద్యార్థుల ఇబ్బందులు

పోచమ్మమైదాన్, నవంబర్ 27: ఆచార్య చందా కాంతయ్య శ్రేష్ఠి జయంతిని గురువారం నిర్వహించనున్నారు. చందా కాంతయ్య 1904 నవంబర్ 28న చందా రత్నయ్య, జగ్గమ్మ దంపతులకు జన్మించారు. సీకేఎం ప్రసూతి దవాఖాన అభివృద్ధి కోసం కృషి చేసినందుకు నాటి ప్రధాని పీవీ నర్సింహారావు చందా కాంతయ్య మెమోరియల్ (సీకేఎం) హాస్పిటల్‌గా నామకరణం చేయించారు. వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు కూడా వైద్య అవసరాల కోసం ఐదెకరాల స్థలం ఇచ్చారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కరీంనగర్‌లోని పొలాస గ్రామంలో చెరువును పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. 1955లో ప్రారంభించిన పోతన ఉత్సవాలు నేటి వరకూ ఏవీవీ వేదికగా నిర్వహిస్తున్నారు. చందా కాంతయ్య 1967 ఆగస్టు 26న స్వర్గస్తులయ్యారు. చందా కాంతయ్య స్ఫూర్తితో ప్రారంభించిన దేశాయిపేటలోని సీకేఎం కళాశాల అంచెలంచెలుగా ఎదిగింది. నాడు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన దివంగత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన కళాశాలలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా ఉన్నత స్థానానికి ఎదిగారు.

దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాల

ఆచార్య చందా కాంతయ్య(ఫైల్)

బీఆర్‌ఎస్ హయాంలో గుర్తింపు

గతంలో వెలుగు వెలిగిన సీకేఎం కళాశాల అచేతనావస్థకు చేరుకున్నప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో కళాశాల నిర్వహణను ప్రభుత్వపరం చేయడానికి కళాశాల వ్యవస్థాపకులతోపాటు అధ్యాపకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. చందా కాంతయ్య కుటుంబ సభ్యుల ఉదారత్వం, అధ్యాపకుల పట్టుదలతో వారి ఫైల్‌కు కదలిక వచ్చింది. 2015లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాలను ప్రభుత్వపరం చేయడానికి ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. అప్పటి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సీకేఎం కళాశాలను ప్రభుత్వపరం చేయాలని కోరడంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో 2023 జూన్ 26న సీకేఎం కళాశాలను ప్రభుత్వపరం చేశారు. ఈ నేపథ్యంలో 64 మంది సిబ్బంది రెగ్యులర్ అయ్యారు. వీరిలో 35 మంది అధ్యాపకులు, 29 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రభుత్వం ఆధీనంలోని రావడంతో వారి జీవితాల్లో వెలుగు నిండాయి. అనంతరం రెగ్యులర్ స్టాఫ్ బదిలీ అయ్యారు. దీంతో ఒక్క ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ తప్ప మిగతా వారంతా గెస్ట్ లెక్చరర్లు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా రెగ్యులర్ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. కళాశాలలో అన్ని రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తేనే పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

'విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావొద్దు'

గీసుగొండ, నవంబర్ 27: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని టెలీ మానసిక వైద్యనిపుణుడు భరత్‌కుమార్ అన్నారు. కొనాయిమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉదయాన్నే లేచి వ్యాయామం, యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అప్పుడే మానసిక ఒత్తిడిని జయించొచ్చని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఎక్కువ సమయం నిద్రించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, అధ్యాపకులు శశిధర్, మహేందర్, పులిప్రసాద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఖిలావరంగల్, నవంబర్ 27: బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ సీహెచ్ వాణీదేవి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఔషధ పరిజ్ఞానంతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి విద్యార్థులు పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ కమల్‌యాదవ్, రాధాకృష్ణ, డాక్టర్ రవిచందర్, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట రూరల్, నవంబర్ 27: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. లాంగ్‌జంప్, జావలిన్‌త్రో, రన్నింగ్, స్టాండింగ్ బ్రాడ్, జంప్‌లో 8 గోల్డ్‌మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, 6 బ్రాంజ్ మెడల్స్‌తో పాటు పలువురు విద్యార్థులు వివిధ పోటీల్లో పతకాలు సాధించారన్నారు. బుధవారం పాఠశాలలో వారిని అభినందించారు. ఉపాధ్యాయులు ఎండీ రియాజుద్దీన్, రవీందర్‌రెడ్డి, భవానీచంద్, వినోద్, గోపి, శ్రీకాంత్, పార్వతి, సుమలత, రాజేశ్ పాల్గొన్నారు. అలాగే, పర్వతగిరి మండలం రోళ్లకల్ ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఐదు మెడల్స్ సాధించారు. నలుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భాషబోయిన రాములు తెలిపారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎం.యశ్వంత్, ఏ అభినయ్, ఏ అఖిల్, ఈ భార్గవి పాల్గొంటారని వివరించారు. అసిస్టెంట్ హెచ్ఎం ఈ రమేశ్, ప్రైమరీ ఇన్‌చార్జి జే బాలరాజ్, పీఈటీలు సురేశ్, సునీల్ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి

పర్వతగిరి: పతకాలు చూపుతున్న విద్యార్థులు

వెంకటలక్ష్మి అంతియయాత్రలో పాల్గొన్న ఎర్రబెల్లి

మృతుల కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

రాయపర్తి, నవంబర్ 27: మండలంలోని ఊకల్, కొండాపురంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పర్యటించారు. ఊకల్‌లో కుందూరు వెంకటలక్ష్మి, కొండాపురంలో ఎద్దు నారాయణ పార్థివదేహాలపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రల్లో పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు గారె నర్సయ్య, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బైరి యాకయ్య, పాము మనోహర్, నార్లాపురం రాజు, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, తేరాల యాకయ్య పాల్గొన్నారు.

'లౌకికవాదం, ప్రజాస్వామ్యం అంశాలను తొలగించొద్దు'

నర్సంపేట, నవంబర్ 27: రాజ్యాంగం నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యం అంశాలను తొలగించొద్దని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య కోరారు. బుధవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ ఈ పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జనవరి 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

- అమల్లోకి విజన్-2041
- 1,805 చదరపు కిలోమీటర్లకు గ్రేటర్ వరంగల్ పరిధి
- గ్రోత్ కారిడార్‌కు అధిక ప్రాధాన్యం

వరంగల్, నవంబర్ 27 : విజన్ 2041తో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అమలులోకి వచ్చింది. ఈనెల 19న నగర పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాస్టర్ ప్లాన్‌కు ఆమోద ముద్ర వేసినట్లు ప్రకటించారు. 2041 నాటికి నగర విస్తరణ, పెరిగే జనాభా అంచనాలకు తగ్గట్లుగా మాస్టర్ ప్లాన్‌ను తీర్చిదిద్దారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటతోపాటు 181 గ్రామాలను కలిపి 1,805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ప్రాంతాన్ని ఇందులో చేర్చారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, గ్రోత్ కారిడార్(మిక్స్‌డ్ జోన్), పబ్లిక్, సెమీపబ్లిక్ , రవాణా (రహదారులు) రిక్రియేషన్ (పార్కులు) జోన్లుగా విభజించారు.



2041 విజన్‌తో రూపొందించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్

గ్రోత్ కారిడార్‌కు అధిక ప్రాధాన్యం

1805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కుడా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో 43శాతం ప్రాంతం గ్రోత్ కారిడార్‌కే కేటాయించారు. ప్రధా న రహదారులకు ఇరువైపులా కమర్షియల్, తర్వాత రెసిడెన్షియల్ జోన్లుగా విభజించారు. అర్బన్ ప్రాంతంలో 20శాతం, రూరల్ ప్రాంతం లో 10శాతం రెసిడెన్షియల్ జోన్‌గా చూపారు. 8 శాతం కమర్షియల్, 2శాతం ఇండస్ట్రియల్, 11 శాతం రహదారులకు కేటాయించారు. మిగిలిన 6శాతం వ్యవసాయం, రిక్రియేషన్, సెమీ పబ్లిక్, గుట్టలు, వాటర్‌బాడీలుగా మాస్టర్ ప్లాన్‌లో చూపించారు.

అనుమతులు కొత్త మాస్టర్ ప్లాన్‌తోనే..

మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి నుంచి భవన నిర్మాణాల అనుమతులు కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరు చేయనున్నారు. మాస్టర్ ప్లాన్‌లో విభజించిన జోన్ల వారీగానే అనుమతులు ఇవ్వనున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నారు. త్రినగరితో పాటు 181 గ్రామాల పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలు జరుగనుంది. అయితే కొంతకాలంగా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను అధికారులు అనధికారికంగా అమలు చేశారు.

నిరసన తెలుపుతున్న కేజీబీవీ సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో కేజీబీవీ ఉద్యోగుల నిరసన

రాయపర్తి, నవంబర్ 27: తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం తిర్మలాయపల్లిలోని కేజీబీవీ ఉద్యోగులు, సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ బుర్ర కవిత మాట్లాడుతూ రాష్ట్రంలోని సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయడంతోపాటు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది స్వరూప, శైలజ, రజిత, కరిష్మ, యాకూబీ, మమత పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కరీమాబాద్, నవంబర్ 27: వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగదారుల ఫోరం సభ్యులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

మిరప, పసుపు పంటల్లో జాగ్రత్తలు అవసరం

దుగ్గొండి, నవంబర్ 27: మిరప, పసుపు పంటల్లో వచ్చే వైరస్‌పై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త కత్తుల నాగరాజు, ఉద్యానశాఖ అధికారి అల్లకొండ జ్యోతి సూచించారు. బుధవారం వారు మండలంలోని నాచినపల్లిలో మిర్చి, పసుపు పంటలను పరిశీలించారు. మిరప పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు 100 కిలోల పశువుల ఎరువుకు రెండు కిలోల ట్రైకోడరాల్, రెండు కిలోల సూడోమోనాస్ కలుపుకొని వారం రోజులపాటు మరిగించిన తర్వాత దుక్కిలో వేసుకోవాలని సూచించారు. రసం పీల్చే పురుగు నివారణకు ఎకరానికి 20 నుంచి 40 అట్టలను పంట చేలల్లో అమర్చుకోవాలని సూచించారు. పసుపు పంటలో వచ్చే దుంపకుళ్లు నివారణకు ఎకరానికి 3కిలోల వేప పిండి, క్యాప్యూరాన్ గుళికలు 6 నుంచి 8 కిలోలు దిగువ భాగంలో చల్లుకోవాలని సూచించారు. లక్ష్మీపురం క్లస్టర్ ఏఈవో విజయ్ కుమార్, రైతులు అచ్చిరెడ్డి, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

'బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

గిర్మాజీపేట, నవంబర్ 27: బీడీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసీం డిమాండ్ చేశారు. అమ్జద్‌పాషా ఫొటోబీడీ కంపెనీ ఆవరణలో బుధవారం ఆయన బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈపీఎఫ్ సంస్థలో ఉన్న రూ. 43 వేల కోట్ల కార్మికుల సొమ్మును మోదీ మింగేశాడని ఖాసీం ఆరోపించారు. రిటైర్డ్ అయిన బీడీ కార్మికులకు నెలకు రూ.700 పెన్షన్ ఇచ్చి వారిని ఆర్థికంగా వెనుకబడేలా చేశాడని దుయ్యబట్టారు. పీఎఫ్ సంస్థకు చెల్లించే ఈపీఎఫ్-1995 పెన్షన్ పథకం కింద నెలకు రూ. 7,500 పెన్షన్ ఇస్తామని మోదీ మాట ఇచ్చాడని, ఐదేండ్లు గడిచినా దాని ఊసేలేదని విమర్శించారు. వెంటనే ఆ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ కుమార్, లక్ష్మి, సరళ, శారద, అబ్దుల్, సలీం, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

సంగెం, నవంబర్ 27: సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు ఉండొద్దని జడ్పీ సీఈవో రాంరెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సర్వే ఫామ్‌లో ఉన్న విధంగా ఎంట్రీ చేయాలని, తప్పులకు తావివొద్దని ఆదేశించారు. తప్పులు ఎంట్రీ చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగి ఓంప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాల పరిశీలన

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 27: ఎంజీఎం హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను వైద్యాధికారులు బుధవారం పరిశీలించారు. పరిపాలనా కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో కార్మికుల వివరాల తనిఖీ ప్రక్రియను ప్రారంభించారు. ఇటీవల ఎంజీఎం ఔట్‌సోర్సింగ్ బాధ్యతలు చేపట్టిన కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఔట్‌సోర్సింగ్ సంస్థ తక్కువ మందితో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విధుల నిర్వహణ బాధ్యతలు చేపట్టిందని వచ్చిన ఆరోపణల ఆధారంగా జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు ఈ తనిఖీ నిర్వహించాలని తీర్మానించారు. దీంతో ఆర్ఎంవో డాక్టర్ అంబి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలను పరిశీలిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాల నమోదుతోపాటు కార్మికులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంస్థ నుంచి బెనిఫిట్స్ అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటున్న వైద్యాధికారులు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యాధికారులు

పాకాలలో కార్తిక వనభోజనాలు

ఖానాపురం, నవంబర్ 27: పర్యాటక ప్రదేశమైన పాకాలలో బుధవారం నర్సంపేట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక వన భోజనాలు చేశారు. రామానుజాచార్య వేదమంత్రోచ్చారణల మధ్య వన సమారాధన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రేణుక, లక్ష్మి, కల్పన పాల్గొన్నారు.

పాకాలలో వనభోజనాలకు వచ్చిన ప్రజలు